క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లాకు ఆరు పతకాలు



నారాయణపేట రూరల్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 11వ యూత్ స్టేట్ మీట్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఆరు పతకాలు సాధించారు. మూడు బంగారు, రెండు వెండి, మరొకటి బ్రౌన్ పతకాలున్నాయి. హై జంప్‌లో జనార్దన్, కవిత, ప్రవీణ్, లాంగ్ జంప్‌లో శ్రీలత, జావలిన్ త్రోలో సందీప్‌లు పతకాలు సాధించారు. ఈ మేరకు క్రీడాకారులకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ అభినందనలు తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

మక్తల్: మాగనూర్ మండలం కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను మక్తల్ ఎంఈఓ అనిల్‌గౌడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం రికార్డులను, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా..

నారాయణపేట రూరల్/దామరగిద్ద: పట్టణంలోని అశోక్ నగర్ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణంలో తన వంతు ఆర్థిక సాయం అందిస్తానని భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు.

■ దామరగిద్దలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శివాజీ విగ్రహ ఆవిష్కరణకు ఆయన హాజరై మాట్లాడారు. శివాజీ పరాక్రమాన్ని నేటి యువత సమాజ సేవలో చూపాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అశోక్ నగర్ యువత పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



నారాయణపేట రూరల్: పట్టణంలోని రోనాల్డ్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్ ఉచితంగా ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన పవన్ ట్రావెల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగుల కోసం అవార్డు సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐజాక్, విజయ్, హాజమ్మ, నాగలక్ష్మి, వెంకటయ్య, లక్ష్మి, సిరి, చందన పాల్గొన్నారు

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

మరికల్: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని జిన్నారం పంచాయతీ కార్మికులు చెన్నయ్య, వెంకటయ్య, శంకర్, వెంకటమ్మ కోరారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా తమకు జీతాలు రాకపోవడంతో కుటుంబాలు నెట్టుకురావడం ఇబ్బందిగా మారిందన్నారు. అప్పులు చేసి ఇంటి ఖర్చులు భరిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పంచాయతీ కార్యాలయం తరఫున బూట్లు, గ్లౌజులు, యూనిఫామ్స్ ఇవ్వలేద న్నారు. వెంటనే జీతాలు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

సీఎంకు ఘన స్వాగతం పలుకుదాం

నారాయణపేట: స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు 21న వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నారాయణపేట ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సూచిక బోర్డు కరువు

మరికల్: కన్మనూర్ రహదారిపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక కొత్తగా వచ్చే వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. మరికల్, కన్మనూర్ గ్రామాల మధ్య మూడు ప్రమాదకరమైన మలుపులున్నాయి. ఎక్కడా సూచి బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచుగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు మలుపు దగ్గర అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపు బాధితుల గోడు పట్టదా?



అనుగొండ ముంపు గ్రామం

- 20 ఏళ్లు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే..
- ఇళ్లకు పరిహారం ఇచ్చి.. ఆర్‌ఆర్ సెంటర్ మరిచారు
- సమస్యల్లో అనుగొండ, అంకెన్‌పల్లి, దాదాన్‌పల్లి



జూరాల బ్యాకు వాటర్ కింద ముంపు గ్రామం అంకెన్‌పల్లి

మక్తల్: జూరాల బ్యాకు వాటర్ కింద ముంపు గ్రామాల్లో దాదాపు 20 ఏళ్లు గడిచినా నేటికీ బాధితుల సమస్యలు తీరలేదు. వర్షాకాలం వస్తే చాలు గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా మారుతుంది. కృష్ణానదికి ఆనుకోని ఉండడంతో అధికంగా నీరు ప్రవహించే సమయంలో పాములు, తేళ్లు, విషపురుగులు, మొసళ్లు వస్తున్నాయి. ఈ సమస్య అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. 2007 డిసెంబర్12న జీఓ 1050 విడుదల చేసి జూరాల బ్యాక్ వాటర్ కింద ముంపు గ్రామాలుగా మక్తల్ మండలం అంకెన్‌పల్లి, దాదాన్‌పల్లి, అనుగొండలను గుర్తించారు. ఈ గ్రామాలు మక్తల్ నుంచి 25 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఇళ్లకు పరిహారం అప్పట్లో అంకెన్‌పల్లికి రూ.18 కోట్లు, అనుగొండకు రూ.20 కోట్లు, దాదాన్‌పల్లికి రూ.16 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామాల్లో సర్వే ఆధారంగా రెండింతలు ధరలు పెరగడంతో పరిహారం ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. మూడు గ్రామాలకు కలిసి రూ.54 కోట్లు ఇళ్లకు నష్ట పరిహారం అందించారు. ముంపు గ్రామాల్లో అనుగొండ గ్రామానికి గ్రామ సమీపంలో 80.12 ఎకరాల భూమిని చూపించారు. ఆర్‌ఆర్ సెంటర్‌లో పనులు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం చెబుతున్నారు. ఇటీవల జిల్లా అధికారులు పర్యటించి ఆర్‌ఆర్ సెంటర్ పనులను ప్లాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మిగతా రెండు గ్రామాలకు ఎక్కడా స్థలం చూపించలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అంకెన్‌పల్లి, దాదాన్‌పల్లి గ్రామాలకు ఆర్‌ఆర్ సెంటర్ల ఏర్పాటు కోసం గ్రామాల నుంచి వినతిపత్రాలు వచ్చాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది. అక్కడి నుంచి ఆదేశాలు వస్తే రెండు గ్రామాల ప్రజల సహకారంతో ఆర్‌ఆర్ సెంటర్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

– రాంచందర్‌నాయక్, ఆర్డీఓ, నారాయణపేట

ఆర్‌ఆర్ సెంటర్ పనులు పూర్తి చేయాలి



జూరాల బ్యాకు వాటర్ కింద ముంపునకు గురైన అనుగొండ గ్రామానికి ఆర్‌ఆర్ సెంటర్‌లో భూమి ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన స్థలంలో ప్లాట్లకు త్వరగా ప్లానింగ్ ఏర్పాటు చేయాలి. నష్టపోయిన బాధితులను ఆదుకోవాలి. అధికారులు గ్రామాన్ని సందర్శించి ఆర్‌ఆర్ సెంటర్‌లో పనులు ప్రారంభించాలి.

– గడ్డం రమేష్, మాజీ సర్పంచ్, అనుగొండ

అంకెన్‌పల్లికి భూమి చూపించండి..



ముంపునకు గురైన అంకెన్‌పల్లికి బాధితుల కోసం ఆర్‌ఆర్ సెంటర్‌కు భూమిని చూపించాలి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్లు నిర్మాణం చేసేందుకు ఆర్‌ఆర్ సెంటర్ కోసం భూమిని చూపించాలని కోరుతున్నాం.

– లక్ష్మణ్, మాజీ సర్పంచ్, అంకెన్‌పల్లి

అనుగొండకు ఆర్‌ఆర్ సెంటర్ పనులు చేస్తున్నాం..

అనుగొండ గ్రామంలో ఆర్‌ఆర్ సెంటర్ కోసం 80 ఎకరాల 12 గుంటల భూమిని కేటాయించడం జరిగింది. గ్రామ శివారులో ఉన్న భూమిని ఎంపిక చేసి గ్రామసభ తీర్మానం చేశారు. అదే స్థలంలో ప్లాట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– శ్రీధర్, ఎస్ఈ, ఇరిగేషన్, మక్తల్

జెడ్పీహెచ్‌ఎస్‌లో డీఈఓ తనిఖీ



నిడ్జింత ఉన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాధికారి

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నారాయణపేట జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసులను విద్యార్థులతోనే తెలుసుకున్నారు. తెలుగు వ్యాకరణం, గణితం గురించి కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇంటర్నల్ మార్కుల వివరాలు, విద్యార్థుల అన్ని సబ్జెక్టుల్లో పరిజ్ఞానం ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించి ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. అనంతరం డీఈఓను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాజర్, వేణుగోపాల్, శ్రీనివాస్, విజయ్, ఆనందం , రామకృష్ణ, వరలక్ష్మి, కతలప్ప, షఫీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మక్తల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వందశాతం అండగా ఉంటుందని మక్తల్ మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్–నారాయనపేట–కొడంగల్ ఎత్తి పోతల పథకంలో భూ సర్వే చేసేందుకు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం అందించేందుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రభుత్వంతో కొట్లాడి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. నారాయణపేట జిల్లా వాసులకు దశాబ్దాలకల 69 జీఓ నుంచి మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం నామకరణం చేయడం జరిగిందన్నారు. మక్తల్ పరిధిలో జక్లేర్, గుడిగండ్ల ఊట్కూర్ మండలాల్లో పలు గ్రామాలు, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు ఈపథకం వర్తిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు నాగేష్, గద్వాల్ రవికుమార్, నర్సింహ, రవి కుమార్, కట్ట సురేష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న న్యాయవాది అయ్యప్ప

మరికల్: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని న్యాయవాది అయ్యప్ప అన్నారు. మరికల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం సొంత ఖర్చులతో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకోని విద్యలో రాణించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్, కళాశాల, పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణిమాల, వెంకట్రాములు, రామకృష్ణ, లక్ష్మీకాంత్, శ్రీకాంత్, భీమ్‌రాజ్, మహేష్, వినయ్, వెంకటేష్, వంశీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బండారు మహోత్సవం



పసుపు బండారు చల్లుతున్న కుటుంబీకులు

ధన్వాడ: మండలంలోని హన్మన్‌పల్లిలో కురుమలు ప్రతి ఐదేళ్ల కోసారి పరమ పవిత్రంగా బావించే ఎల్లమ్మ బండారు ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుట్ట వద్ద ఉంచిన పసుపు కుండలకు పూజలు చేశారు. బండారుగా బావించే పసుపును కుటుంబ సమేతంగా గ్రామ ప్రజలు వారిపై చల్లి ఆశీర్వదించారు, ఈ నెల 24న బీరప్ప బండారు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో కలప్ప, ఆశప్ప, శ్రీశైలం, మల్లప్ప, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు/కొత్తపల్లి: అధికార పార్టీకి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ అధికార బలంలో కావలి ఎల్లప్పపై పోలీసు కేసు నమోదు చేయించి, అతనిపై దాడి చేసిన ఎస్ఐ విజయ్‌కుమార్, ఇతర పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామంలో కావలి ఎల్లమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. బాధితుడికి బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి మెప్పు పొందడం కోసం గ్రామంలో అతనికి వ్యతిరేకంగా ఉన్న ఎల్లప్పను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచక్షణ రహితంగా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సంఘటనలో ఎస్ఐని, పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. రెండు రోజుల్లో జిల్లా ఎస్పీ స్పందించకపోతే డీజీపీకి, మానవహక్కుల సంఘాలను సంప్రదించి అవసరమైతే కులసంఘాలతో కలిసి ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సలీం, మధుసూదన్‌రెడ్డి, భగవంతు, సాయిలు, గోపాల్, రాములు, మహిపాల్‌గౌడ్, తిరుపతి, శివశంకర్, రఫీ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో బుధవారం పీడీఎస్‌యూ నాయకులు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. ఆహారం విషయంలో నాణ్యత పాటించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, మహిపాల్, సురేష్, సాగర్, గణేష్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నరహరి

ధన్వాడ: 21న నారాయణపేట జిల్లాలో రూ.వేయి కోట్లతో నిర్వహిస్తున్న పనులకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరహరి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నారాయణపేట జిల్లాను వెనుకబడిన జిల్లాగా మార్చిందని, ఇప్పుడు మన ముఖ్యమంత్రి నారాయణపేట జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందుండేలా కృషి చేస్తున్నారన్నారు. ఎడారిలా మారిన నారాయణపేట జిల్లాను కొడంగల్–పాలమూరు ఎత్తిపోతల పథకంతో జిల్లాకు సాగు, తాగునీరు తీసుకొస్తున్నారన్నారు. అపక్‌పల్లి వద్ద మెడికల్ కాలేజీ మైదానంలో బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రామ్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మయ్యగౌడ్, రాంచంద్రి, ఆనంద్‌గౌడ్, వెంకట్రాములు, కమ్మరి వెంకట్రాములు, రాములు, రఘువేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలిన శివ మాలధారులు

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ గ్రామం నుంచి శివ మాలధారులు శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో శివయ్యకు పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం ఇరుముడి కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శివ మాలధారులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం ఇరుముడులతో పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు శేఖర్‌గౌడ్, దేవరాజ శ్రీనువాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాన్‌కుర్తిని మండలంగా ప్రకటించాలి



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ కాన్‌కుర్తి చుట్టుపక్కల గ్రామాల నాయకులు బుధవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బస్వరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, పుష్పల్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు ఛత్రపతి శివాజీ



మరికల్‌లో శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

- పలుచోట్ల ఘనంగా శోభాయాత్ర
- ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో జయంతి వేడుకలు
- భూనీడులో విగ్రహావిష్కరణ
- పలుచోట్ల విగ్రహ ఏర్పాటుకు భూమి పూజలు

సాక్షి, నెట్‌వర్క్: నారాయణ పేట పట్టణంలో బరంబావి నుంచి శివాజీ మహారాజ్ శోభాయాత్ర ప్రారంభించారు. అంతకుముందు వాహనంపై శోభాయాత్ర వీరసావర్కర్ చౌరస్తా, గాంధీనగర్ వరకు కొనసాగింది. నారాయణపేటలో వివేకానంద మున్సిపల్ పార్క్‌లో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు చేసి నివాళులర్పించారు.

■ శివాజీ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని డీఎస్‌ఓ భాను ప్రకాష్ తెలిపారు. జాజాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

■ మండలంలోని లోకాయపల్లి గోపాలస్వామి ఆలయంలో శివాజీ జయంతిని పురస్కరించుకొని తుల్జా భవానీ మాతకు పూజలు చేశారు.

■ మక్తల్ బస్టాండ్‌లో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమి పూజ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు బ్రెడ్లు పంపిణీ చేశారు. మక్తల్ పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అన్నదానం చేశారు. ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు.

■ మక్తల్ మండలం మాద్వార్, ఖానాపూర్, జక్లేర్, అనుగొండ, చిట్యాల, పారేవుల గ్రామాల్లో చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు.

■ దామరగిద్దలో శివాజీ నగర యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహావిస్కరణకు భూమిపూజ చేశారు.

■ ధన్వాడ మండల కేంద్రంలో రాత్రి వరకు శోభాయాత్ర నిర్వహించారు.

■ మరికల్‌లో ఆంజనేయస్వామి ఆలయం నుంచి శివాజీ విగ్రహంతో ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు.

■ కొత్తపల్లి మండలంలోని భూనీడులో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణలో కాంగ్రెస్, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

■ కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో హిందూ వాహిని ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ చేశారు.

■ మద్దూరు పట్టణంలోని అమర్‌గడ్డ రామాలయం దగ్గర యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 60 మంది యువకులు రక్తదానం చేశారు.

■ నర్వ, ఉందేకోడ్, పెద్దకడ్మూర్, యాంకి, లంకాల్, రాంపూర్, కుమార్‌లింగంపల్లి, కల్వాల్ గ్రామాల్లో శివాజీ మహారాజ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. నర్వలో ర్యాలీ నిర్వహించారు. శివాజీ జీవిత చరిత్రపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



ఉందేకోడ్‌లో..



నారాయణపేటలో రక్తదానం..



శోభాయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఆర్ వెంకట్రాములు

నారాయణపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో గెలవడానికి వ్యవసాయ కూలీలకు, పేదలకు అనేక వాగ్దానాలు ఇచ్చి, సంక్షేమ పథకాలు ప్రకటించి ఎన్నికల్లో గెలిచాక వాటిని అమలు చేయకుండా మోసం చేయడం పాలకులకు పరిపాటిగా మారిందని, వెంటనే ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీల సంక్షేమానికి బడ్జెట్లో నిధులు తగ్గించిందన్నారు. ఉపాధి హామీకి రూ.2లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూమి లేని వారికి ఏడాదికి రూ.12 వేలు, ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, దళితులకు రూ.12లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలుచేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. సమావేశంలో బాలప్ప, శివకుమార్, శ్రీనివాస్, ఆనంద్, శరణబసప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మునిరంగస్వామి శకటోత్సవం



శకటోత్సవంలో పాల్గొన్న ఆటోలు, ట్రాక్టర్లు, తదితర వాహనాలు

భూత్పూర్: పట్టణంలోని శ్రీమునిరంగ స్వామి శకటోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చన చేశారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ రకాల తినుబండారాలు, వివిధ దుకాణాలు వెలిశాయి. జాతరలో భాగంగా దేవాలయ కమిటీ సభ్యులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో పేకపత్తా ఆటను సైతం ఆడుతున్నారు. యువకులు పేకపత్తాపై మొగ్గు చూపుతున్నారు.